క్లుప్తంగా

వరి కొనుగోళ్లు బంద్

పెంచికల్‌పేట్: మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని మూడు వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల గురువారం సాయంత్రం నుంచి బంద్ నిలిపివేస్తున్నట్లు కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల వద్ద ధాన్యం ఉంటే వెంటనే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం



మద్దతు తెలుపుతున్న నాయకులు

పెంచికల్‌పేట్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట 24 రోజులుగా సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పెంచికల్‌పట్ పీఆర్‌టీయూ నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. ఆయన వెంట కార్యదర్శి వెంకటేశ్, గంగా భవాని, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

కౌటాల: మండలంలోని తలోడి గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీలలోని 59 ఉపకూలాలకు సమాన న్యాయం జరగలనే ఉద్దేశంతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిందన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, బండి శైలజాగౌడ్, బాపు, నక్క శంకర్, జనార్దన్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

కౌటాల: మండలంలోని ప్రజలు బుధవారం నూతన సంవత్సరాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా చికెన్, మటన్, చేపల దుకాణాలు రద్దీగా కనిపించాయి. విజయనగరం, యాపలగూడ, శివలింగపూర్, సదాశివపేట, పలు ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే స్థానిక శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు అర్ధరాత్రి వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.

నేడు ఉద్యోగుల సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గిరిజన శాఖలో పని చేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగుల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు రాంచందర్, పోచం, చిరంజీవి, రవిలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ బాలికల పాఠశాలలో ఉదయం 11 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న దాదిరావు

నార్నూర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. బుధవారం మండలంలోని ఖైర్దాట్వా గ్రామంలో అంజనే య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబా ల్ టోర్నమెంట్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఖైర్దాట్వా రాయి సెంటర్ సార్‌మేడి మాడవి సాగర్, గ్రామ పటేల్ మాడవి నారంజీ పటేల్, పెందూర్ సంతోష్, ఆత్రం జాలింషావ్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేయండి

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) గ్రామంలో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని మాజీ సర్పంచ్ అడప్ మారుతి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న విద్యుత్ తీగలు వేలడుతుండడంతో స్కూల్ బస్సులకు, పత్తి వాహనాలకు తగులుతున్నాయన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని కోరారు.

ఆటలాడేదెక్కడ..?



ఈ క్రీడా ప్రాంగణం మండలంలోని పార్వతిపేట గ్రామానికి చెందినది. మండల కేంద్రానికి పార్వతిపేట సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. గ్రామంలో స్థలం దొరకక పోవడంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం వద్దనే దీన్ని కూడా ఏర్పాటు చేశారు. పార్వతి పేట గ్రామం నుంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో క్రీడలు ఆడదానికి రాక పోవడంతో నిరుపయోగంగా మారింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న తెలంగాణ క్రీడా ప్రాంగణం మండల కేంద్రానికి చెందినది. క్రీడా ప్రాంగణంలో వ్యాయమం చేసేందుకు ఒక బార్ ఏర్పాటు చేశారు. అంతే మిగతా సౌకర్యాలు కల్పించలేదు. వర్షాకాలంలో పిచ్చి మొక్కలు పేరుగుతున్నాయి. క్రీడాకారులు ఆటలు ఆడడం లేదు. వాకింగ్ చేయడానికి కూడా ఎవరూ ఆసక్తి చూపడం లేదు. అన్ని గ్రామాల్లో కూడా నిరుపయోగంగా మారాయి.

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- ఊరి శివారులో ఏర్పాటు
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

దహెగాం: చలికాలం వచ్చిందంటే యువత నుంచి వృద్ధులు వరకు శరీర ధారుఢ్యం, ఆరోగ్యం కోసం ప్రతీ రోజు ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. చిన్నారులు సైతం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడేందుకు ఇష్టపడుతారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడలు ఆడేందుకు వివిధ రకాల స్పోర్ట్స్ కిట్లు సైతం అందించారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు ఆర్బాటంగా చేసినా.. పూర్తిస్థాయిలో ప్రాంగణాలు పూర్తి చేయకపోవడం, కొన్ని చోట్ల ఇంకా స్థలాలు గుర్తించక పోవడం, గుర్తించిన చోట సౌకర్యాలు కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆటలాడేదెక్కడ అంటు గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు.

మండలంలో 24 గ్రామ పంచాయతీలు..

గత ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. మండలంలో 7 చోట్ల మాత్రమే క్రీడా ప్రాంగణాలు గుర్తించారు. మిగతా చోట్ల స్థలాలు లేక నిర్మించలేదు. కొన్నిచోట్ల స్థలం లేక పాఠశాలలకు చెందిన క్రీడా మైదానంలోనే క్రీడా ప్రాంగణాలుగా గుర్తించారు. ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో సైతం సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

పిచ్చి మొక్కలతో..

క్రీడాప్రాంగణాల్లో చాలా చోట్ల పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. స్థలాలు గుర్తించి సౌకర్యాలు కల్పించినప్పటికీ మైదానాలను చదును చేయక పోవడంతో నిరుపయోగంగా మారాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. నిరుపయోగంగా మారిన వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం. ఇది వరకే క్రీడాకారులకు క్రీడ కిట్లు అందించాం. యువకులు, క్రీడాకారులకు అవగాహన కల్పించి ఆటలు ఆడేలా చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, ఎంపీడీవో దహెగాం

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అభిషేకం చేస్తున్న అయ్యప్ప స్వాములు



అగ్నిగుండ కార్యక్రమం నిర్వహిస్తున్న స్వాములు

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీరంగనాయక ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన జిల్లాల సుధాకర్ గౌడ్ గురుస్వామి 18వసారి మాల ధారణ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎనగంటి భిక్షపతి గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా పడిపూజ నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి చిత్రపటాలను బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భారీగా అయప్ప స్వాములు తరలివచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

బెజ్జూర్: మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ తాళ్ల రామయ్యను సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పరామర్శించారు. కరీంనగర్ పట్టణంలోని ప్రతిమ ఆసత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం అక్కడికి చేరుకొని ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

బెజ్జూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. చింతలమానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన మెస్రం సాయి, బెజ్జూర్ మండలం ఇప్పలగూడ గ్రామానికి చెందిన నైతం అజయ్‌లు మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాలను పోస్టుమార్టం కోసం తీసుకు రాగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

వాసవీక్లబ్ సేవలు విస్తరించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్: వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తరించాలని క్లబ్ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రసిడెంట్ ఎకిరాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో మంగళవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 మంది సభ్యులతో ప్రారంభమైన వాసవీ క్లబ్ ప్రస్తుతం 2 వేలకు పైగా క్లబ్‌లు ఏర్పాటై సుమారు లక్షలకు పైగా సభ్యులు ఉన్నారన్నారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి, కోషాధికారిగా కట్కూరి కిషోర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గంధం శ్రీనివాస్, గుండ బాలేశ్వర్, ముక్త సురేశ్, ఎకిరాల సుగుణాకర్, చిలువేరు శ్రీనివాస్, గుండ ప్రమోద్, కాచం ప్రకాశ్, కొలిప్యాక వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా భీమా కోరేగావ్ దివస్



నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం భీమా కోరేగావ్ శౌర్య దివస్ వేడుకలను మహార్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి, కోరేగావ్ శౌర్య విజయ స్థూపం వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకులు బసర్కార్ విశ్వనాథ్ మాట్లాడుతూ 1818 జనవరి 1న సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటంలో 500 మంది మహార్ సైనికులు 28 వేల మంది విశ్వసైనాన్ని ఓడించి విజయం సాధించారని గుర్తు చేశారు. ఆత్మగౌరవ పోరాటంలో విజయోత్సవం సందర్భంగా ప్రతీఏటా భీమా కోరేగావ్ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలోని వీరవెల్లి, బోదంపల్లి, ముత్తంపేట్, గుడ్లబోరి గ్రామాల్లో శౌర్య దివస్ వేడుకలు నిర్వహించారు. నాయకులు బండురావు, గోవింద్‌రావు, సోమయ్య, ఏమాజీ, రవి, దీలిప్, ఉద్దవ్, కిశోర్, జీవన్‌దాస్, విఠల్ పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో బుధవారం మహార్ సంఘం నేతలు శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. 1818లో పాస్‌వాయి రాజాతో జరిగిన యుద్ధంలో వేలాది మంది మహర్ సైనికులు వీరమరణం పొందారు. వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ శౌర్య దివస్ నిర్వహించినట్లు కేంద్రీయ రాష్ట్ర అధ్యక్షుడు మార్శల్ రవిచందర్ గాబాడే తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవా లక్ష్మి హాజరుకాగా, మహర్ సంఘం శిలానంద్ కాంబ్లే, విశ్వభూషన్ వాగ్‌మారే, రమాకాంత్, గాయక్‌వాడ్ శివాజీ, మిలింద్, రాజ్‌కుమార్, ధన్‌రాజ్, అంబాదాస్, సాగర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. బుధవారం తన నివాసంలో ఎస్టీయూ నూతన డైరీని సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యను అభ్యసిస్తారని, పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో వారు ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యపై అవగాహన కల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుర్క మాణిక్‌రావ్, తుకారాం, సంజయ్‌కుమార్, సులేమాన్, సంతోష్, లక్ష్మణ్, వినోద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కెరమెరి: మూడు రోజుల పాటు మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నిర్వహించే వంగపురి భీమయ్యక్, రాజుల్ దేవతల పూజ కార్యక్రమాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ నాయకులు కోరారు. బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు ఆత్రం ధర్మా, ఆత్రం సోనేరావు, ఆత్రం రాజు, మడావి రాజు, ఆత్రం పవన్, ఆత్రం ముకింద్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్చోడ: సివిల్ సప్లయ్‌లో పనిచేసే కార్మికులు సమస్యలు పరిష్కారించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద నిర్వహించిన నిరవధిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల ఒప్పందం ప్రకారం జీవోను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు, స్వీపర్లకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సివిల్ సప్లయ్ కార్మికులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: యూటీఎఫ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊశన్న, ఉపాధ్యక్షులు ఇందురావు, హేమంత్, నాయకులు సమ్మయ్య, సుభాష్, మీనాకుమారి, కిరణ్, రవి తదితరులున్నారు.

3న బహిరంగ విచారణ

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రతినిధి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కుల సంఘాల ప్రతినిధులు హాజరై అభిప్రాయాలు తెలుపాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

బేల: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మండల కమిటీ సభ్యులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల వర్గానికి చెందిన కొందరు పెద్దలు ఎస్సీ వర్గీకరణ బిల్లును అడ్డుకోవడం తగదని హెచ్చరించారు. ఎవరైనా అడ్డు వస్తే వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమన్న, కృష్ణపెల్లి అంకుష్, దేవన్న, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ మాధవి

వాంకిడి: రోడ్డు నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఆటో పాయింట్ వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో మద్యం తాగవద్దన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ చేయించుకోవాలని, ప్రతీ డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక లక్ష్య సాధనకు సమన్వయంతో పని చేయాలి



అధికారులతో చర్చిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: ఏరియాలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి వార్షిక లక్ష్య సాధనకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత, వార్షిక లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై జీఎం సుదీర్ఘంగా చర్చించారు. కొత్త సంవత్సరంలో నూతనోత్తేజంతో వార్షిక లక్ష్యసాధన కోసం పనిచేయాలని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తే వార్షిక లక్ష్యాన్ని చేధించడం కష్టమేమీ కాదన్నారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, కైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, డీజీఎం సెక్యూరిటీ ఉమాకాంత్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, సీహెచ్‌పీ హెచ్‌వోడీ కోటయ్య, డీవైసీఎంవో మధుకుమార్, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

‘మాలీలు ఏకం కావాలి’



మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: సామాజిక న్యాయం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు లక్షల మంది మాలీ కులస్తులు ఏకం కావాలని అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత 24 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని గ్రామాల్లో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జనవరి 12న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, పటేళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు షిండే గంగారం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ ఉమేశ్ రావు డోలే, జిల్లా కార్యవర్గ సభ్యులు విట్టల్ కొట్రంగే తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలకు అండగా ఉంటా’



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల్లో ఓటమి చెందిన పేదల పక్షాన ఉంటూ ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. మండలంలోని రాజుగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేలా బీఆర్ఎస్ తరపున పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభ్యున్నతికి విశేష కృషి చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడాం బాబురావు, పీఏసీఎస్ చైర్మన్ మెస్రం పరమేశ్వర్, మాజీ ఎంపీపీ గంద్రత్ రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, గంగయ్య, సుదర్శన్, గేడం రాము, జంగు బాపు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శశికాంత్, జగన్‌మోహన్, దయాకర్ రెడ్డి, పురుషోత్తం, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.